# ఋతువు



కొంగతి చంద్రావళి

చెక్క తలుపు మీద 'టక్ టక్' మని చప్పుడు చేశాడు కిరణ్.

"ఎవరది ?"

లోనుండి పరిచితమయిన పురుష కంఠం కరుగ్గా ప్రశ్నించింది.

"నేనే! కిరణ్ని," నెమ్మదిగా చెప్పాడు.

"తలుపు తెరిచే ఉండాలి! లోపలికి రా!" అంది తిరిగి ఆ కంఠం.

కిరణ్ తలుపు తోసుకుని లోపలికి నడిచాడు. లోపలి గదిలో మార్పేమీ లేదు. ఎదురుగా లోపల గదిలోనికి తలుపు, దానికో కర్టెన్ వేలాడుతోంది. ప్రక్కగా చెక్క బీరువా, దానిపైన ఓ

ట్రంక్ పెట్టె, పాతది ఉంది. ఇవతలి ప్రక్క గోడనానుకుని వేసిన నులక మంచం ఆ మంచంమీద కూర్చుని ఉన్నాడు, ఓ వ్యక్తి. అతనే ప్రభు! కిరణ్ ప్రశ్నకు బదులు చెప్పిన మనిషి.

అతను ప్రస్తుతం చూడటానికి భయం గొల్పేటట్లున్నా, నిదానంగా పరీక్షించి చూస్తే ఒకప్పుడు అతను చాలా అందమైన వ్యక్తి అని తెలుస్తుంది. అతని అందాన్నంతా మింగేసి వికారంగా కనబడుతున్నది అతని కుడికంటికి అడ్డంగా కట్టబడిన నల్లని గుడ్డ. ఎడమ కన్ను తెరిచిచూస్తున్నా అది పని చేయదు. కారణం అది గాజుకన్ను. అతను అంధుడు.

"గుడ్ ఈవెనింగ్, ప్రభు సాబ్!" కిరణ్ ముందుకు వస్తూ అన్నాడు.

"రా! కూర్చో," అన్నాడు ప్రభు.

మంచానికి దగ్గరగా స్టూల్ లాక్కుని కూర్చున్నాడు కిరణ్. తదేకంగా ప్రభు వైపు చూడసాగాడు.

అతని భుజం మీదుగా కిటికీలోనుండి కనబడుతున్న పచ్చని ప్రకృతి నవ్వుతూ పలకరిస్తోంది. రివ్వున వీచింది చల్లగాలి ఒళ్ళు జలదరించింది కిరణ్‌కు

నులకమంచంమీది వ్యక్తి రవ్వంతయినా చలించలేదు.

కిరణ్ తిరిగి ప్రభును పరీక్షగా చూడసాగాడు. తైలసంస్కారం లేకనో, అతనిలాగే దిగుళ్ళతో క్రుమ్మిపోవడం వల్లనో జుత్తు రాగిరంగులో ఉంది. తెల్లటి ప్యాంటు బాగా మాసి ఉంది. దానిమీద తెల్లటి చొక్కా, పైన తొడిగిన కోటు లోపల ఉండిపోయింది అతను ఎప్పుడూ కిరణ్‌కు అదే దుస్తులలోనే దర్శనమిస్తాడు. వయసు నలభై ఉంటుంది గానీ, ఇంకా ఎక్కువగానే కనిపిస్తాడు

అతను జేబులు తడుముకుని సిగరెట్ తీసి, నోట్లో పెట్టుకున్నాడు. కిరణ్ తన దగ్గర ఉన్న సిగరెట్ లైటర్ తీసి అతని సిగరెట్ వెలిగించాడు అతను గోడకు ఆనుకుని సిగరెట్ కాల్చసాగాడు.

కిరణ్ ఓ క్షణం తటపటాయించి అడిగాడు.

"కాత్యా ఏంచేస్తోంది?"

"ఏమో వెళ్ళి చూడు!" అన్నాడు పొగ విడుస్తూ.

కిరణ్ వెంటనే లేచి లోపలి గుమ్మం వైపు నడిచాడు. పరదా తొలగించి చూశాడు ఎదురుగా కాత్యా కనబడ లేదు. ఒక్క అడుగు ముందుకువేసి, పక్కకు తలతిప్పి చూశాడు. అక్కడ కనబడిన దృశ్యం చూడగానే అతని పెదవులమీద చిరునవ్వు కదలాడింది.

కాత్యా అప్పుడే స్నానంచేసి వచ్చి నట్లుంది. చీర కట్టుకుంటోంది కిరణ్‌ని చూస్తూనే,

"ఏయ్ స్టుపిడ్ గెటవుట్!" అని అరిచింది

నవ్వుకుని వెనక్కు తిరిగాడు కిరణ్.

"ఏమిటి?" సిగరెట్ తీసి చేతిలో పట్టుకుంటూ ప్రశ్నించాడు ప్రభు

"ఏమీలేదు!"

కిరణ్ మళ్ళీ వచ్చి స్టూల్‌మీద కూర్చున్నాడు. ఐదు నిముషాలు గడవక ముందే కాత్యా రెండు కప్పుల టీ తెచ్చి చెరి ఒకటి యిచ్చింది. టీ కప్పు తీసుకుంటూ ఆమె కళ్ళలోకి చూసి చిన్నగా నవ్వాడు కిరణ్.

కాత్యా బదులుగా వెక్కిరించింది.

టీ తాగటం పూర్తయిన తర్వాత కిరణ్ సిగరెట్ వెలిగిస్తూ అడిగాడు.

"మీకు నిన్న సగంలోనే ఆపేశారు ప్రభు సాబ్!"

"ఏమిటి?"

"అదే మీ కథ!"

"కథా! హుం." అతను నిట్టూర్చాడు.

"నిజమే! కథ అయితే బాగుండేది. కానీ అది కథ ఎలా అవుతుంది? జీవితం! జీవితం కాబట్టే యిలా విషాదంగా పరిణమించింది."

అతని కంఠం బరువుగా మారింది.

"బాధపడకండి! కష్టాల తరువాతే ఎవరికయినా సుఖం లభించేది" ఓదార్పుగా అన్నాడు కిరణ్.

"సుఖం!" అతని కంఠం విషాదంగా ధ్వనించింది "ఇంకెక్కడి సుఖం! అన్నీ మనోరమతోనే చచ్చిపోయాయి. నా దృష్టిలో మనూ చచ్చిపోయినదాని క్రిందే లెక్క. అసలు నేనే చచ్చిపోయాననుకో. ఇప్పుడు నీ ఎదురుగా ఉన్నది కేవలం జీవచ్ఛవం మాత్రమే! మనూ లేని జీవితం నాకెందుకు? అసలు భగవంతుడు నన్నెందుకు పుట్టించాడాఅని బాధపడుతుంటాను నేను. పుట్టించినా నన్ను మనోరమతో ఎందుకు కలపాలి? తర్వాత మా జీవితాలిలా ఎందుకు చీలిపోవాలి?" అతని కంఠస్వరం క్రమంగా గద్గదంగా మారసాగింది

కిరణ్ అతనిని ఓదార్చే ప్రయత్నం గానీ, మధ్యలో అడ్డుకునే ప్రయత్నం గానీ చేయలేదు. అతని వాక్ప్రవాహం మధ్యలో ఆగదని తెలుసు.

"మొట్టమొదటిసారి సెలవులకి వచ్చినపుడు చూశాను మనోరమని ఆ రెండు నెలలూ చూపులతోనే సరిపోయింది. ఒక్క మాటగూడా మాట్లాడలేకపోయాను. అతి ప్రయత్నంమీద ఆమె పేరు మాత్రం తెలుసుకోగలిగాను మనుకు సవితితల్లి ఉండేది. ఒక స్వంత తమ్ముడు ఉండేవాడు. వాడి పేరు రాజు. మనుకు వాడంటే పంచప్రాణాలు. ఒక్కోసారి వాడిమీద నాకు చచ్చే ఈర్ష్య వేసేది. అంతగా ప్రేమించేది వాణ్ణి. కారణం తల్లి లేకపోవడం. సవితి తల్లి వాడిని నానా కష్టాలూ పెట్టేది.

అందుకని వాడిని అత్యంత గారాబంగా చూసుకునేది. మా జీవితాలు కలవడానికీ కారణం వాడే! విడిపోవడానికీ కారణం వాడే! అసలు వాడే లేకపోతే..."


అతను హఠాత్తుగా ఆగిపోయాడు

"ఎంత బాగుండేది," అతను చిన్నగా గొణుక్కోవటం కిరణ్‌కు వినిపించకపోలేదు.

"మరుసటి సంవత్సరం సెలవులకి దడదడలాడే గుండెలతో వచ్చాను, మనూకి పెళ్ళి అయిపోయి ఉంటుందనే భయంతో నా అదృష్టమో, దురదృష్టమో మనూకి పెళ్ళి కాలేదు మనూతో పరిచయం ఏర్పరచుకోవాలని తహతహ లాడిపోయాను. చివరికి నా ప్రయత్నం రాజు ద్వారానే ఫలించింది ఒకసారి కాలవలో పడి మునిగిపోతున్న రాజును రక్షించాను అదే మా పరిచయానికి దారితీసింది. రాజుద్వారా అభివృద్ధి చెందింది. నేను గడిపిన సెలవుల రెండు నెలల్లో ఒకటిన్నర నెలలో నేనూ మనూ అత్యంత సన్నిహితంగా రాగలిగాము. నేను ఉత్తరాలు వ్రాసి రాజు ద్వారా మనూకు పంపేవాణ్ణి. భయం భయంగా నా దగ్గరకు వచ్చే మనోరమను చూస్తే నాకు లేడిపిల్ల గుర్తుకు వచ్చేది. వచ్చి నిశ్శబ్దంగా కూర్చునేది. అంతే! ఒక్క మాట కూడా మాట్లాడేదికాదు. నేనే ఇద్దరి బదులూ మాట్లాడేవాణ్ణి. చివరికి వెళ్ళిపోయేటప్పుడు మాత్రం 'ఇక ఉత్తరాలు పంపకండి, నాకు రావడానికి కుదరదు,' అనేది. నేను 'అలాగే' అనే వాణ్ణి. కానీ మళ్ళా జాబు వ్రాసి పంపితే తప్పకుండా వచ్చేది. నిజంగా ఆ రోజులు మరపురానివి కిరణ్!" ఈసారి ప్రభు స్వరం ఆర్ద్రంగా మారింది.

"ఇక వారంరోజులకి వెళతాననగా మనూని పెళ్ళిచేసుకోవలసి వచ్చింది. కారణం మనూ సవితితల్లి, మనూకు రెండో పెళ్ళి సంబంధం కుదిర్చింది. అన్ని ప్రతిబంధకాలూ ఎదుర్కొని మనూని గుళ్ళో పెళ్ళిచేసుకున్నాను. వాళ్ళ పిన్ని వచ్చి మమ్మల్ని నానా తిట్లూ తిట్టి, తమ్ముణ్ణి మా దగ్గరే వదిలి వెళ్ళిపోయింది. మా పెళ్ళి జరిగిందనే సంతోషం కంటే, విడిగా ఉండాలనే భయం ఎక్కువయింది నాకు. మనూనీ, రాజునీ మా తాత దగ్గర వదిలి బయలు దేరాను.

నేను ట్రైన్ ఎక్కుతూ ఉండగా పెదవులమీద చిరునవ్వు చెదరకుండా, కళ్ళలో నీళ్ళతో వీడ్కోలిచ్చిన తీరు ఏనాటికీ మరచిపోలేను. తిరిగి ఆత్రంగా సంవత్సరానికి వచ్చిన నాకు మూణ్ణెళ్ళ కాత్యాను బహుమానంగా యిచ్చింది. మనూ పోలికతో మెరుస్తున్న పాపని చూసి మురిసిపోయాను. రెండు సంవత్సరాలు అలాగే రాకపోకలతో గడిపేశాను. ఈ మధ్యలోనే మా ముసలి తాత కూడా చనిపోయాడు. ఇంకొక్క-




సంవత్సరం గడిస్తే పాపనూ, కాత్యానూ తీసి కెళదామనుకున్నాను." ప్రభు ఆగిపోయాడు.

కిరణ్ మౌనంగా వింటున్నాడు.

"అలాగే జరిగితే మనం మనుష్యుల మెలా అవుతాం? తలచినదంతా జరిగితే మనిషే దేవుడయిపోవచ్చు. చైనా యుద్ధంలో గాయపడిన నేను రెండు నెలలు ఆలస్యంగా యింటికి తిరిగి వచ్చాను. తిరిగి వస్తే ఏముంది? పిడుగుపాటులాంటి వార్త! నేను యుద్ధంలో చనిపోయానని ఊరంతా పుకారు వ్యాపించింది. మనూకు చేతిలో పైసా డబ్బు లేదు పైగా నా మరణ వార్త నిజమని నమ్మించేశారు. ఈ పరిస్థితిలో గత్యంతరం లేక పిన్ని దగ్గరికే వెళ్ళింది. ఈ పరిస్థితుల్లోనే రాజుకు టైఫాయిడ్ వచ్చింది. మనూని ఇంట్లో ఉంచుకోవడమే ఎక్కువైన వాళ్ల పిన్ని, వాడికి మందులేమి యిప్పిస్తుంది? తమ్ముడు ఏమవుతాడోనని భయపడింది మను. వాడంటే ఆమెకు ఎంత ప్రాణమో నాకు బాగా తెలుసు. అందుకని... అందుకని పరిస్థితులకోసం మను దిగజార వలసి వచ్చింది మను అందం నాకు తెలుసు! అందుకోసం ఆకలిగా ఎదురుచూస్తున్న ఈ సమాజం, ఈ అవకాశాన్ని అదనుగా చూసుకుని మనును కాటు వేసింది. నా గుండెల్లో ఆరని చిచ్చు రగిల్చింది."

ప్రభు వేదన అంతా కంఠంలో ప్రతిఫలిస్తోంది

అతను క్షణం ఆగి పళ్ళు పటపటా కొరికాడు

"మనూ గనక నా కళ్ళముందు పడి వుంటే ఆమెనేమీ చేసేవాణ్ణి కాదు. ముందు వాణ, ఆ రాజుగాణ కాల్చి

పారేసేవాణ్ణి. వాడే... వాడే మా జీవితాలిలా కావడానికి కారణం !"

"తర్వాత ఏంచేశారు ?" కిరణ్ ఆసక్తిగా అడిగాడు. నిర్లిప్తంగా సమాధానమిచ్చాడు ప్రభు.

"ఏంచేస్తాను ? అర్ధరాత్రి యింటికి వచ్చిన నాకు మను కనబడలేదు. వాళ్ళ పిన్నినడిగితే ఊరూ వాడా ఏకమయ్యే టట్టు తిట్టింది నన్ను. 'నువ్వు యుద్ధంలో ఛస్తే నీ పెళ్ళాం పిల్లల్ని సాకలేక ఛస్తున్నా నని,' మనోరమ అంత పని చేసిందంటే నమ్మలేకపోయాను. కానీ నిజమే ! మనూ అక్కడ లేదు. తమ్ముణ్ణి హాస్పిటల్‌లో చేర్చి అక్కడే వుంది. మను గూర్చి, ఆమె పినతల్లి చెడ్డగా చెబితే నమ్మేవాణ్ణి కాను. కానీ నా ప్రాణ స్నేహితులు కూడా చెప్పాక నమ్మక తప్పలేదు. నా మనసు విరిగిపోయింది. కాత్యాని తీసుకుని రైలెక్కి యిక్కడికి వచ్చేశాను. తర్వాత జరిగింది నీకు తెలిసిందే గదా ! బంగ్లాదేశ్ యుద్ధంలో నా కళ్ళు పోవడం, యిక నేను ఈ పరిస్థితులు వదలలేక యిక్కడే స్థిరపడి పోయాను."

ఐదు నిముషాలపాటు ఇద్దరి మధ్యా భయంకరమైన నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"మీరు మనోరమని క్షమించి ఉంటే బాగుండేది." చివరికి అన్నాడు కిరణ్.

"నిజమే ! ఆ మాట యిక్కడికి వచ్చిన ప్రతిక్షణమూ అనుకున్నాను. కానీ మనూ దిగజారిన పరిస్థితి కాత్యా కోసమై వుంటే నేను క్షమించి వుండే వాణ్ణి. ఆ రాజు కోసం జీవితాన్ని బలి చేసుకుంది మను. తిరిగి మనూ దగ్గరికి వెళదామని ఎంతో ప్రయత్నించాను. కానీ ప్రయోజనం వుండదని నాకు తెలుసు."

"అంటే ?"

"మనోరమ బతికి ఉండదు !" అతని కంఠంలో నిశ్చయం ధ్వనించింది.

"ఎందుకని ?"

"ఆమె అభిమానం నాకు తెలుసు. నేను వచ్చి వెళ్ళిన మరుక్షణం ఆమెకు తెలిసి ఉంటుంది, కాత్యాని తీసుకువెళ్ళి పోవటంతో నేను ఆమెని అసహ్యించు కున్నానని. ఆ విషయం అర్థంకాగానే మనోరమ ఆత్మహత్య చేసుకుని ఉంటుంది"

కిరణ్ ఏం మాట్లాడలేదు. కిటికీలో నుండి బయటకు చూసి, చీకట్లు ముసురు కుంటున్నాయని గమనించి లేచాడు.

"ఇక నే వస్తానండి !"

"భోజనంచేసి వెళ్ళండి."

గుమ్మంలో నిలబడిన కాత్యా అంది.

"వద్దు ! మరోసారి చేస్తాను," అని ముందుకు నడిచాడు.

కాత్యా అతన్ని గుమ్మం వరకూ సాగనంపింది. గుమ్మం మెట్లు దిగగానే రివ్వున చలిగాలి కొట్టింది యిద్దరికీ.

కిరణ్ మెట్లు దిగాడు. కాత్యా

గుమ్మంలో నిలబడింది. అతను వెను దిరిగి కాత్యా చేయి పట్టుకున్నాడు. కాత్యా ఓ మెట్టు దిగింది.

"కాత్యా! ఓ మాట అడగనా?" మృదువుగా అన్నాడు.

"అడగండి! ఏమిటి?" ఆశ్చర్యం ధ్వనించింది కాత్యా కంఠంలో.

"నువ్వు మీ అమ్మను అసహ్యించుకుంటున్నావా?"

రెండు నిముషాలు నిశ్శబ్దం.

"లేదు," అంది చివరికి.

"వస్తాను, గుడ్ నైట్!" కిరణ్ వెనుదిరిగాడు ఆమె చేయి వదిలేసి.

అతను కనుమరుగయేవరకూ చూసి వెనుదిరిగింది కాత్యా!

* * *

పరధ్యానంగా ఉన్న కిరణ్ తలుపు మీద మునివేళ్ళతో చప్పుడు చేయడం మరచిపోయి చిన్నగా తోశాడు. లోపల గడియ వేసి ఉండకపోవటంచేత వెంటనే తెరచుకుంది. యాధాలాపంగా లోపలకి అడుగు వేయబోయిన కిరణ్ ఎదుటి దృశ్యం చూసి స్తంభించిపోయాడు.

ఎదురుగా నులకమంచంమీద కూర్చున్న ప్రభు కుడికంటికి నల్లటి గుడ్డ లేదు. అది మంచంమీద ఉంది. ప్రభు చేతిలో బాగా నలిగిపోయిన పాత ఉత్తరం ఉంది. దాన్ని చదువుతూ "మనూ, మనూ" అని గొణుక్కుంటున్నాడతను. మొహంలో వేదన గూడు కట్టి ఉంది. కంటినుండి నీళ్ళచుక్కలు రాలుతున్నాయి ఉత్తరంమీద.

అప్పటికి తేరుకున్న కిరణ్ వెనక్కి నడిచి చప్పుడు కాకుండా తలుపు వేశాడు. ఓ రెండుక్షణాలు అలాగే ఆగి నిలబడి తర్వాత తలుపు తట్టాడు. ఓ నిముషం తర్వాత "లోపలకి రా కిరణ్!" అని వినబడింది

తలుపు తోసుకుని లోపలకు నడిచాడు కిరణ్. ప్రభు కంటికి అడ్డంగా నల్లటిగుడ్డ ఉంది. మొహంలో ఎటువంటి భావమూ లేదు.

ఆశ్చర్యాన్ని అణచుకుంటూ ముందుకు నడిచి స్టూల్ లాగి కూర్చున్నాడు.

"విశేషాలు ఏమిటి కిరణ్?" అతను మామూలుగా అడిగాడు.

"ఏమీ లేవు ప్రభు సాబ్."

రెండు నిముషాలు నిశ్శబ్దం రాజ్యం చేసింది ఇద్దరిమధ్యా.

"ప్రభు సాబ్! మిమ్మల్నో ప్రశ్న అడిగేదా?" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అడిగాడు కిరణ్.

"ఏమిటి కిరణ్?" ప్రభు కంఠంలో లీలగా విస్మయం గోచరించింది.

"ఇప్పుడు మనోరమ మీకు తటస్థపడితే మీరు ఆమెను క్షమించి స్వీకరించగలరా?"

నిట్టూర్చాడు ప్రభు.

'ఇంతేనా! ఇంకా ఏమిటో అనుకున్నాను. అయినా ఎందుకిటువంటి

ప్రశ్నలు వేస్తావు కిరణ్ ? అది జరిగేది కాదని నీకు తెల్సు "

"ఒకవేళ జరిగిందే అనుకోండి." రెట్టించాడు కిరణ్.

"ప్చ్ ! లాభంలేదు కిరణ్ అలా ఎన్నటికీ జరగదు. మనూ బతికి ఉండదు. నాకు నమ్మకంలేదు." నిరాశగా అన్నాడు.

"మీ మాట నిజమే అయినా, ఆమె ఆత్మశాంతికోసం అడుగుతున్నానను కోండి. ప్లీజ్ ! చెప్పండి." అభ్యర్థనగా అన్నాడు కిరణ్

"మను బ్రతికి ఉండాలే కానీ అంత కంటేనా ? అంధకార బంధురమైన ఈ జీవితంలో దీపం వెలిగించే శక్తి ఒక్క మనూకే ఉంది కానీ ఆమె నా దగ్గరకు రావడానికి మార్గమేది ? రాదు. నా జీవితం ఈ జన్మకింతే !"

కిరణ్ బదులు చెప్పలేదు.

క్రితంరోజు మాదిరిగా కాకుండా కిరణ్ ఆవేళ కాత్యా కోరికపై వాళ్ళింట్లో భోజనం చేశాడు

గుమ్మం వరకూ సాగనంపిన కాత్యా చేయిపట్టుకుని చిన్నగా అడిగాడు కిరణ్.

"కాత్యా ! మీ నాన్న ఎందుకని అంధుడుగా నటిస్తున్నారు ?"

బిత్తరపోయింది కాత్యా.

"మీకెలా తెలుసు ?" తేరుకుని అంది చివరికి.

చిన్నగా నవ్వాడు కిరణ్.

"నిజం ఎంతకాలం దాగుతుంది !"

"ఒక కన్ను పోయిన మాట నిజమే గానీ రెండవ కన్ను పనిచేస్తూనే ఉంది. వికృతంగా ఉండటంతో అలా గుడ్డ కట్టుకున్నారు నాన్న మీతో చెప్పవద్దంటే నేను చెప్పలేదు క్షమించండి కిరణ్ !" కాత్యా కంఠం దీనంగా వుంది

"మరేం ఫర్వాలేదు ఇంతకీ ఈ నాటకం నన్ను పరీక్షించడానికేనా ?"

"అవును !"

"మరయితే నేను నెగ్గానా ?"

"వేరే చెప్పాలా కిరణ్ ! మిమ్మల్ని ఎంత అభిమానించకపోతే, నాన్న తన గతజీవితం గురించి మీతో చెబుతారు ! మా అమ్మగురించి కూడా దాచలేదు. ఆమె అలా అని తెలిసి కూడా మీరు నన్ను పెళ్ళిచేసుకోగలరో లేదో అని పరీక్షించారు ! అమ్మని ఎవరు అసహ్యించుకున్నా నాన్న భరించలేరు కిరణ్ !" కాత్యా కంఠంలో తండ్రిపై గల ప్రేమ అంతా వినిపిస్తోంది

"థాంక్యూ !" అన్నాడు కిరణ్.


* * *

అలవాటయిన తలుపు చప్పుడు విని "లోపలికిరా. కిరణ్ !" అన్నాడు ప్రభు.

తలుపు తోసుకుని లోపలికి వచ్చిన అలికిడి వినిపించింది.

"కోర్చో కిరణ్ !" అన్నాడు ఎంత సేపటికీ స్టూల్ లాగి కూర్చున్న చప్పుడు వినిపించకపోయేసరికి

మెల్లగా స్టూల్ లాక్కుని కూర్చున్న చప్పుడు వినిపించింది.



"కిరణ్! ఈవేళ నీతో ఓ ముఖ్య విషయం చెప్పాలి."

బదులుగా ఏమీ జవాబు రాలేదు

"ఏమిటి కిరణ్! మాట్లాడవేం?" ఆశ్చర్యంగా అన్నాడు ప్రభు

ఈసారి సన్నగా ఏడుపు వినబడింది ప్రభుకు

"ఏమిటిది కిరణ్? ఏడుస్తున్నావా? ఎందుకు? అసలు నువు కిరణ్‌వేనా, కాదా? కాత్యా! కాత్యా!" గట్టిగా అరిచాడు ప్రభు.

ప్రభుకు వినబడిన ఏడుపు స్థాయి హెచ్చింది. లోపలినుంచి కాత్యా పరిగెత్తుకుంటూ వచ్చి, స్టూల్‌మీద కూర్చుని ఏడుస్తున్న వ్యక్తిని చూసి దిగ్భ్రాంతురాలైంది. ఆ వ్యక్తి కూడా ఏడుపు ఆపి తల ఎత్తి కాత్యా వైపు చూసింది.

"కిరణ్ కాదు నాన్నా! ఎవరో ఈవిడ? బహుశా..." కాత్యా ఆగిపోయింది.

కంటి గుడ్డ లాగి పారేశాడు ప్రభు. ఎదురుగా ఏడుస్తున్న వ్యక్తిని చూసి "మనూ!" అన్నాడు దిగ్భ్రాంతితో.

మనోరమ ఒక్కసారిగా అతని కాళ్ళమీద వాలిపోయింది

"నన్ను క్షమించండి! నేను పాపాత్మురాలిని, మీకు ద్రోహం చేశాను..." అంటూ.

ఆమెను లేవనెత్తాలని ప్రయత్నించాడు రాజా.

"నిన్ను కిరణ్ తీసుకువచ్చాడు కదూ! అతనితో నీ గురించి చెప్పడం ఎంత మంచిదయింది. ఎంత నిష్కల్మష హృదయుడు కిరణ్? నిన్ను నాతో కలిపి పుణ్యం ఒడిగట్టుకున్నాడు అతనికి కాత్యానిచ్చి పెళ్ళిచేసినా ఈ ఋణం

తీర్చుకోలేను మనూ!" ఆవేశంతో అంటున్నాడు ప్రభు.

"మీరు ముందు నన్ను కాదు, కిరణ్‌ని క్షమించండి!" మనోరమ ప్రభు కాళ్ళను ఇంకా గట్టిగా చుట్టేస్తూ అంది.

"అతన్ని క్షమించటం ఏమిటి మనూ? పూజించాలి గానీ!"

"అయితే అతనిమీద కోపం లేదు కదూ!''

"లేదు మనూ! కిరణ్ మీద నే నెందుకు కోపం పెట్టుకుంటాను? ముందు అతనికి కృతజ్ఞత తెలుపుకోవాలి. ఇంతకీ ఎక్కడున్నాడు కిరణ్?" ఆతృతగా అడిగాడు ప్రభు

అప్పటికి తేరుకుంది కాత్యా. బయట గనక కిరణ్ ఉన్నాడేమోనని గబగబా బయటికి నడవబోయింది.

ఆమెని పిలిచాడు ప్రభు.

"కాత్యా! మన కాత్యా. మనూ! అచ్చు నీ పోలికే చూశావా! కాత్యాలో నిన్ను చూసుకుంటూ యిన్నాళ్ళూ బ్రతకగలిగాను, తెలుసా? ఇప్పుడు కాత్యా కిరణ్‌తో వెళ్ళిపోయినా నాకు దిగులు లేదు. నువ్వు వచ్చేశావుగా!" ఆనందంతో అంటున్నాడు ప్రభు

సంభ్రమంతో మనోరమా, కాత్యా ఒకరినొకరు చూసుకోసాగారు. మనోరమ కళ్ళనిండా నీళ్ళునిండి బుగ్గలమీద జారిపడ్డాయి. వాటిని తుడిచాడు ప్రభు.

"కిరణ్‌ని మరిచేపోయాను! కిరణ్ ఎక్కడున్నాడు మనూ?" ఆతృతగా అడిగాడు ప్రభు.

"గుమ్మం బయటే ఉన్నాడు." మనోరమ సమాధానం చెప్పింది

కాత్యా గబగబా బయటికి నడిచింది. కిరణ్ కొద్దిదూరంలో నిలబడి దిక్కులు చూస్తున్నాడు. అతన్ని పిలిచింది కాత్యా.

"ఏమిటి బయటే నిలబడ్డారు? లోపలికి రండి!" ఆనందం వినబడుతోంది స్పష్టంగా, కాత్యా కంఠంలో.

బదులేమీ యివ్వకుండా మౌనంగా లోపలికి నడిచాడు కిరణ్, కాత్యా వెంట.

"లోపలికి రా, కిరణ్!" గుమ్మంలోనే ఆగిపోయిన కిరణ్‌ని చూసి ఆప్యాయంగా అన్నాడు ప్రభు

"నన్ను క్షమిస్తారా, ప్రభుసాబ్!" నమ్రతతో అడిగాడు కిరణ్.

"వింతగా మాట్లాడుతున్నావ్ కిరణ్! నిన్ను నేను క్షమించటం దేనికి? నిజానికి నువ్వే నన్ను క్షమించాలి. నేను గుడ్డివాడిగా నీ దగ్గర నటించినందుకు" అన్నాడు ప్రభు.

"అయితే నన్ను క్షమించినట్లేనా?"

"తిరిగి అదే ప్రశ్న!"

"అవును, ప్రభూసాబ్! నేను మిమ్మల్ని మోసంచేశాను. మనోరమ నా అక్కయ్య అని ముందే చెప్పనందుకూ, నా పూర్తి పేరు రాజ్ కిరణ్ అని మీకు తెలియపరచనందుకూ మీరు నన్ను క్షమించాలి!"

తెల్లబోయారు ప్రభూ, కాత్యా!